www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 7 ఏప్రిల్ 2023




## ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించాలి : కమిషనర్


సిబ్బందికి సూచనలు ఇస్తున్న కమిషనర్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్త సేకరణ సేకరించాలని మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ అన్నారు. గురువారం పారిశుధ్య విభాగం అధికారులు, కార్యదర్శులు సిబ్బందికి ఆయన సూచనలు చేశారు. పట్టణంలో పలు వార్డుల్లో పర్యటించి చెత్త సేకరణ తీరును పరిశీలించారు. చెత్తను ఎన్ని రోజులకు తీసుకొని వెళ్తున్నారు అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలు చెత్తను రోడ్లపై, మురుగు కాలువల్లో పారవేయకుండా, మున్సిపల్ వాహనాలకు అందించి పట్టణ పరిశుభ్రతకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# వైభవంగా రథోత్సవం


ఊరేగిన కల్యాణ కోదండరాముడు

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామివారి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజు గురువారం స్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైన రథోత్సవం సాయంత్రం 5 గంటలకు ముగిసింది. శ్రీ సీతాలక్ష్మణ సమేత కోదండరాముడు రథంపై అధిష్ఠించి గ్రామవీధుల్లో విహరించారు. భజన బృందాల చెక్కభజనలు, కోలాటాలు చేస్తుండగా భక్తులు రథాన్ని లాగారు. అడుగడుగునా భక్తులు కర్పూర నీరాజనాలు అందించారు. ఆత్మ రథికుడు, శరీరమే రథం, బుద్ధి సారథి, మనస్సు పగ్గం, ఇంద్రియాలే గుర్రాలు, విషయాలే వీధులు. ఈ రీతిలో శరీరాన్ని రథంతో పోల్చడంతో స్థూల శరీరం వేరని, ఆత్మ అందుకు భిన్నమనే ఆత్మానాత్మ వివేకం కలుగుతుంది. రథోత్సవంలో ముఖ్యంగా కలిగే తత్త్వజ్ఞానమిదే. కార్యక్రమంలో డెప్యూటీ ఇఒ నటేష్ బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనుంజయ, ఇంజనీరింగ్ అధికారులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# పత్తి రైతు దిగాలు

- తగ్గిన దిగుబడి, ధరలతో విలవిల
- గతేడాది క్వింటా ధర రూ.10 వేలు
- ప్రస్తుతం రూ.6 వేలకే పరిమితం
- దళారుల బెడద - ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి-చాపాడు

ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్లకు తోడు అంతర్జాతీయ మార్కెట్‌లో ధరల హెచ్చుతగ్గుల కారణంగా పత్తి ధరలు పడుతూ.. లేస్తూ ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులు పత్తిని అమ్మేందుకు ఊగిసలాడుతున్నారు. గత ఏడాదితో పోల్చికుంటే ధరలు భారీగా తగ్గాయి. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటా పత్తి ధర రూ.ఆరు వేలు పలుకుతోంది. ఖరీఫ్‌లో సాగైన పత్తి పంట వర్షాల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. పంట సాగు సమయంలో ఆశాజనకంగా ఉన్నప్పటికీ తరువాత వర్షాలకు పంట దెబ్బతినడంతో దిగుబడి తగ్గుముఖం పట్టింది. దిగుబడితో పాటు ధరలు అమాంతం తగ్గాయి. ఎకరాకు మూడు క్వింటాళ్ల వరకు మాత్రమే దిగుబడి వస్తోంది. గత ఏడాది పత్తి పంటకు గిట్టుబాటు ధర ఉండటంతో ఎక్కువ మంది రైతులు పంట సాగు చేపట్టారు. కిలో పత్తి ధర ప్రారంభంలో రూ.85 నుంచి రూ.90ల వరకు పలికింది. ప్రస్తుతం రూ.60కు తగ్గింది. గత ఏడాది క్రితం సిసిఐ రూ.95కి కొనుగోలు చేసింది. ఈ ఏడాది దిగుబడి చేతికి అంది వచ్చిన తర్వత అనంతరం రూ.60 నుంచి రూ.65కు చేరింది. గతంలో దిగుబడి ఆశాజనకంగా లేని సమయంలో క్వింటా రూ.105 వరకు పలికింది. ప్రస్తుతం ప్రభుత్వం నిర్ణయించిన గిట్టుబాటు ధరకు కూడా పత్తి రైతులు నోచుకోవడంలేదు. రైతులకు వేర్వేరు కారణాలు చూపి దళారీలు మభ్యపెట్టేవారు. నాణ్యత, రంగు లేదని సాకులు చూపుతూ తక్కువ ధర నిర్ణయిస్తున్నారు. దళారీలు పత్తి రైతుల వద్ద తక్కువ ధరలకు సేకరించి పత్తిని ప్రొద్దుటూరు, గుంటూరు, నంద్యాల, తమిళనాడు, మహారాష్ట్ర, తెలంగాణ మిల్లులలో అమ్ముకుంటూ అధిక ధరలు సొమ్ము చేసుకుంటున్నారు. గ్రామాలలో తూకాలు వేసే సందర్భంలో కూడా చాలావరకు మోసాలకు పాల్పడుతున్నప్పటికీ కట్టడి చేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. ధరలు తగ్గడంతో పత్తి కోసం వ్యాపారులు గ్రామాల బాట పట్టిన రైతులు అమ్మకాలకు విముఖత చూపుతున్నారు.


మండలంలో సాగులో ఉన్న పత్తి పంట

### తెగుళ్లతో తగ్గిన దిగుబడి



ఎకరా పొలాన్ని కౌలుకు తీసుకొని పత్తి పంటను సాగు చేపట్టాను. పంట సాగు చేసినప్పట్టి నుంచి తెగుళ్ల బెడద అధికంగా ఉంది. అధికంగా పురుగు మందులు వాడాల్సి వచ్చింది. ప్రస్తుతం పంట చేతికి వచ్చిన తరువాత ధరలు అమాంతం తగ్గాయి. పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ప్రభుత్వం పత్తి రైతులను ఆదుకోవాలి.

**- లక్ష్మిరెడ్డి, కౌలు రైతు, తిప్పాయపల్లె, ఖాజీపేట మండలం.**

### పత్తి పంట సాగుతో నష్టపోయాం



ఏడు ఎకరాలలో పత్తి పంటను సాగు చేపట్టాం. ఎకరాకు రూ.30 వేల వరకు సాగు ఖర్చులు అయ్యాయి. దిగుబడి చూస్తే ఎకరాకు 3 క్వింటాళ్ళ వరకు మాత్రమే వచ్చినది. క్వింటా ధర రూ.6200 మాత్రమే పలికినది. ఎకరాకు రూ.పది వేల వరకు నష్టం వచ్చింది. గత ఏడాది పత్తి పంటకు ఉన్న ధరలను చూసి పంట సాగు చేపట్టడంతో నష్టపోవాల్సి వచ్చింది.

**- మస్తాన్ యాదవ్, పత్తి రైతు చాపాడు.**

### అధిక వర్షాలతో తగ్గిన పత్తి దిగుబడి



ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పత్తి పంట అధిక వర్షాలకు దిగుబడి తగ్గింది. రైతులకు వర్షపు నీటిని నిలువ ఉండకుండా తొలగించుకోవాలని అవగాహన కల్పించాం. రైతులు పలు జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ అయినప్పటికీ దిగుబడి తగ్గింది. మైదుకూరు డివిజన్ పరిధిలో 3768 హెక్టార్లు పత్తి పంట సాగైనది. రాజుపాలెం మండలంలో అత్యధికంగా 3334 హెక్టార్లలో పత్తి పంట సాగుకాగా పంటకోత ప్రయోగాలలో 3 నుంచి 4 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. పంట కోత ప్రయోగాల నివేదికలను ఉన్నత అధికారులకు పంపాము. పంటకోత ప్రయోగాల ఆధారంగా ఇన్సూరెన్స్ మంజూరు అయ్యే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం నిర్ణయించిన గిట్టుబాటు మాత్రం అమలయ్యేలా చేస్తున్నాం.

**- కృష్ణమూర్తి, వ్యవసాయ శాఖ ఎడిఎ, మైదుకూరు డివిజన్.**

## 87 మంది విఆర్‌ఒల ప్రొబేషన్ డిక్లరేషన్ పూర్తి

ప్రజాశక్తి-చాపాడు

జిల్లాలో 87 మంది విఆర్‌ఒల ప్రొబేషన్ డిక్లరేషన్ ఉత్తర్వులు కలెక్టర్ విజయ్‌రామరాజు గురువారం విడుదల చేశారు. రెండు సంవత్సరాల క్రితం ఉమ్మడి జిల్లాలోని 228 మంది విఆర్‌ఎలను విఆర్‌ఒలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ రెండు సంవత్సరాల క్రితం అవకాశం కల్పించారు. విఆర్‌ఒలుగా విధులు నిర్వహిస్తూ ప్రొవిషన్ సి పరీక్షలు, డిపార్ట్మెంట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన 87 మందికి ప్రొబిషన్ డిక్లరేషన్ ఉత్తర్వులు విడుదల చేశారు. కడప జిల్లాలో 76 మంది, అన్నమయ్య జిల్లాలో 11 మంది ప్రొవిషన్ పూర్తయిన వారు ఉన్నారు. మిగిలిన వారు డిపార్ట్మెంటల్ పరీక్ష ఉత్తీర్ణత సాధించని కారణంగా వారి ప్రొబేషన్‌ను పెండింగ్‌లో అలాగే ఉంచారు.

## పేదలకు భూములు పంపిణీ చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పెనగలూరు మండలంలో కొండూరు గ్రామ పంచాయతీ, వెలగచర్ల వెంగమాంబపురం రెవెన్యూ గ్రామ పరిధిలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూముల వివరాలను సమాచార హక్కు చట్టం ద్వారా రెండు నెలల నుండి ఎటువంటి సమాధానం ఇవ్వడం లేదని ఎస్ఎఫ్ఐ జిల్ల కార్యదర్శి నరసింహ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ప్రకారం వివరాలు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. తహాశీల్దార్, సర్వేయరు కలిసి ప్రభుత్వ భూములను సబ్ డివిజన్ చేసి అడంగల్‌లో, రికార్డులలో పేర్లు ఎక్కించడానికి రూ.లక్షలు తీసుకుంటున్నారని విమర్శించారు. పేదలకు భూపంపిణీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. భూ పంపిణీకి సంబంధించి తహాశీల్దారులు ఎమ్మెల్యేలు చెప్పిన పేర్లకు మాత్రమే అసైన్మెంట్ కమిటీలో పెడుతున్నారని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. గ్రామాలలో గ్రామసభలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేసి అసైన్మెంట్ కమిటీలో ఆమోదించాలన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు లక్ష్మీనారాయణ, పెంచలయ్య పాల్గొన్నారు.

## మే 10లోగా హద్దు రాళ్లు నాటాలి

**- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ గిరీష**

ప్రజాశక్తి-రాయచోటి

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రీసర్వేలో భాగంగా మే 10వ తేదీలోగా హద్దురాళ్లు నాటే ప్రక్రియ పూర్తి కావాలని ఆర్డీఒలు, తహశృల్దార్‌లు, మండల సర్వేయర్లను కలెక్టర్ గిరీష ఆదేశించారు. గురువారం రాయచోటి కలెక్టర్ బంగ్లా నుంచి రీసర్వే హద్దురాళ్లనాటే ప్రక్రియ పురోగతిపై కలెక్టర్ గిరీష వర్చువల్ విధానంలో ఆర్డీఓలు, తహాశీల్దార్‌లు, మండల సర్వేయర్‌లతో సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా, డిఆర్‌ఒ సత్యనారాయణ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎడి జయరాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొదటి దశలో 84 గ్రామాలలో రీసర్వే ప్రక్రియ పూర్తి చేసామని పేర్కొన్నారు. ఇందులో అత్యంత ప్రాధాన్యతమైనటువంటి ప్రక్రియ స్టోన్స్ నాటేది ఉందని, జిల్లాలో 57,040 స్టోన్స్ నాటాల్సి ఉందని పేర్కొన్నారు. హద్దురాళ్ళు నాటే ప్రక్రియలో ప్రతి మండలానికి ఇచ్చినటువంటి టార్గెట్‌ను అచీవ్ కావాలన్నారు. డైలీ టార్గెట్ అచీవ్ కాకుండా పెండింగ్ పెట్టుకుంటే వేటు తప్పదని సంబంధిత అధికారులను కలెక్టర్ హెచ్చరించారు. గవర్నమెంట్ రీసర్వే ప్రక్రియ పై చాలా సీరియస్‌గా తీసుకొని పనిచేస్తుందని పేర్కొన్నారు. ఆ దిశగా అధికారులు అందరూ బాధ్యతతో క్రియాశీలకంగా పని చేయాలని సూచించారు. మండల సర్వేయర్ల దగ్గర ఉన్న రోవర్లు స్టోన్ ప్లాంటేషన్‌కి మాత్రమే ఉపయోగించాలని పేర్కొన్నారు. నిర్లక్ష్యం చేయకుండా రోజు రోజుకి పురోగతి కనిపించేలా పనిచేయాలన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా మాట్లాడుతూ రీసర్వేలో మొదటి దశలో పూర్తయిన గ్రామాలలో స్టోన్ ప్లాంటేషన్ త్వరగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. స్టోన్ ప్లాంటేషన్ కోసం 52 టీములను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి రోజు ఒక రోవర్ 50 స్టోన్స్ పాతాలన్నారు. ప్రతిరోజు ప్రోగ్రెస్ మీద సీసీఎల్‌ఏ పర్యవేక్షణ చేస్తుందన్నారు. వీరబల్లి మండలం ఓదివీడులో రెండు టీములు ఉన్నాయి రెండు రోవర్స్ ఉన్నాయి 50 రాళ్లు మాత్రమే నాటారని ఇందులో పురోగతి కనిపించాలన్నారు. స్టోన్ ప్లాంటేషన్ మీద తహాశీల్దార్లు సీరియస్‌గా తీసుకొని పనిచేయాలన్నారు. ఎక్కడైనా రైతులకు సమస్యలు ఉంటే తహసీల్దార్ లు క్షేత్రస్థాయిలోకి వెళ్లి అక్కడికక్కడే ఆ సమస్యను పరిష్కరించాలన్నారు. స్టోన్స్ జిల్లాకు చేరిన వెంటనే మండలాలకు చేర్చి మరుసటి రోజు పనులు మొదలు పెట్టాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాలోని ఆర్డీఒలు, తహశీల్దార్‌లు, మండల సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జెసి, డిఆర్‌ఒ

# 'పది' తెలుగు ప్రశ్నపత్రం లీకేజీలో ఆరుగురు అరెస్టు

**- మైదుకూరు డిఎస్‌పి వంశీధర్‌గౌడ్ వెల్లడి**

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండలంలో పదవ తరగతి మొదటి పరీక్ష తెలుగు జవాబు పత్రం లీకేజీకి కారణమైన ఆరుగురిని అరెస్టు చేశామని మైదుకూరు డిఎస్‌పి వంశీధర్ గౌడ్, మైదుకూరు రూరల్ సిఐ నరేందర్‌రెడ్డి, ఎస్ఐ విద్యాసాగర్ పేర్కొన్నారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మండలంలోని అంబవరానికి చెందిన మేకల గంగాధర్ అనే వ్యక్తిని తెలుగు జవాబు పత్రం కేసులో అనుమానించి అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. విద్యుత్ ఆఫీస్‌లో లైన్‌ఇన్స్పెక్టర్‌గా పనిచేస్తున్న రామిరెడ్డి ద్వారా తనకు జిరాక్స్ కాపీ వచ్చిందని గంగాధర్ చెప్పాడని పేర్కొన్నారు. తన చెల్లెలి కోసం ఒక కాపీ జిరాక్స్ ఇవ్వాలని గంగాధర్ స్నేహితుడైన సతీష్‌తో కలిసి వెళ్లి బి.మఠంలో ఉన్న జిరాక్స్ సెంటర్ వద్దకు వెళ్లి జిరాక్స్ కాపీలు తీసుకున్నారన్నారు. జిరాక్స్ సెంటర్ వద్ద ఉన్న ఓ టివి విలేకరి వీడియోతీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారన్నారు. గంగాధర్ చెప్పిన సమాచారం మేరకు రామిరెడ్డిని అదుపులో తీసుకొని విచారించగా తన కుమార్తె పదవ తరగతి పరీక్షలు రాస్తున్నడంతో దీప్తి స్కూల్లో పనిచేసే హిందీ ఉపాధ్యాయుడు నుంచి రెండు మైక్రో జిరాక్స్ తెలుగు జవాబు కాపీలను తీసుకున్నాడన్నారు. రామిరెడ్డి సమాచారం మేరకు స్కూల్ వద్దకు వెళ్లి ఫిజిక్స్ టీచర్ సుబ్రహ్మణ్యం, తెలుగు టీచర్ రామాంజనేయులు, హిందీ టీచర్ బాలరాజులు అదుపులో తీసుకుని విచారించామన్నారు. బి.కోడూరు మండలంలోని సగిలేరు గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు బాలచంద్రుడు ద్వారా తన సమీప బంధువు తెలుగు టీచర్ రామాంజనేయులకు వాట్సాప్ ద్వారా పంపారని పేర్కొన్నారు. ప్రశ్నపత్రాన్ని ఆ ముగ్గురు టీచర్లు దీప్తి హైస్కూల్ కరస్పాండెటర్ రమణారెడ్డికి తెలిపారు. రమణారెడ్డి సూచనల మేరకు ముగ్గురు టీచర్లు తెలుగు గైడ్‌లో నుంచి జవాబులు సేకరించి వాటిని మైక్రో జిరాక్స్ కాపీలను స్కూల్లోని ప్రింటర్ ద్వారా చేసి వాటిని విద్యార్థులకు పంపిణీ చేశారని పేర్కొన్నారు. దీప్తి హైస్కూల్‌లోని కంప్యూటర్, జిరాక్స్ మిషన్‌ను, మూడు కాపీ పత్రాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. సగిలేరు గురుకుల పాఠశాల వద్దకు వెళ్లి విచారణ నిర్వహించామన్నారు. అక్కడ తెలుగు టీచర్ చంద్రబాబును విచారించామన్నారు. తమ స్కూలుకు సంబంధించి 62 మంది విద్యార్థులు పరీక్షలు బి.కోడూరు జడ్పీ హైస్కూల్లో పరీక్షలు రాస్తున్నడంతో రూమ్ నెంబర్-7లో ఉన్న తమ విద్యార్థి ద్వారా ప్రశ్నపత్రం తెల్లకాగితంలో రాసుకున్నామన్నారు. ప్రశ్నపత్రం లీకేజీ కేసులో మేకల గంగాధర్, గంగిరెడ్డి చిన్నరామిరెడ్డి, చిట్టిబోయిన బాలసుబ్రమణ్యం, వనిపెంట రామాంజనేయులు, సగిలి బాలరాజు, పొందిబోయిన చంద్రబాలుడును అరెస్టు చేశామని పేర్కొన్నారు.



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి

# 'నిర్దేశించిన గడువులోగా లక్ష్యాలను పూర్తి చేయాలి'


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి-రాయచోటి

ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల లక్ష్యాలను నిర్దేశించిన కాల పరిమితిలోగా పూర్తి చేయడానికి కృషి చేస్తున్నట్లు కలెక్టర్ గిరీష ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జవహర్‌రెడ్డికి వివరించారు. గురువారం విజయవాడలోని ముఖ్య కార్యదర్శి కార్యాలయం నుంచి వివిధ శాఖల కార్యదర్శులతో కలిసి జిల్లా కలెక్టర్లు, జెసిలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ అంశాలలో సమీక్షించారు. రెవెన్యూ అంశాలలో భాగంగా రీ సర్వే, జాతీయ రహదారులకు భూసేకరణ, వ్యవసాయం, ఉద్యానవనం, అనుబంధ రంగాలు, గృహనిర్మాణంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లేఅవుట్ల వారీగా మంజూరు చేసిన ఇళ్ల పట్టాలు, గృహ నిర్మాణ ప్రగతి, పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, వేసవి కాలం దృష్ట్యా తీసుకోవాల్సిన చర్యలు తదితరాలపై జిల్లాల వారీగా కలెక్టర్లతో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సమీక్షించి తగు సూచనలు జారీ చేశారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ సర్వేలో భాగంగా మొదటి దశ పూర్తి చేసిన గ్రామాలలో మే 10 లోపు రీసర్వే రాళ్లను తప్పనిసరిగా పాతించాలన్నారు. ఇందుకు ఖచ్చితమైన కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సూచించారు. అదేవిధంగా వెబ్ ల్యాండ్‌లో రీసర్వే పూలింగ్ డేటాను, రాళ్లు పాతిన డేటాను ఎప్పటి కప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. జాతీయ రహదారులకు భూసేకరణ పూర్తి చేసిన వాటికి 3జీ అవార్డ్స్ పాస్ చేసి, లబ్ధిదారులకు వేగవంతంగా పరిహారం పంపిణీ చేయాలన్నారు. ప్రాజెక్టు వారీగా ఎంత భూసేకరణ చేయాలి, ఎంత సేకరించారు, మిగిలినది ఎంత, పరిహారం చెల్లింపు ఎంత చేశారు, ఇంకెంత చేయాల్సి ఉంది, అందుబాటులో ఉన్న నిధులు, ఇంకనూ అవసరమైన నిధులు ఎంత కావాలి తదితర అంశాలలో అధికారులతో సమీక్షించారు. వ్యవసాయం, ఉద్యానవన రంగాలకు సంబంధించి ఈ క్రాప్ బుకింగ్, ఇకెవైసిలలో ప్రగతిని సమీక్షించారు. యంత్ర సేవా పథకం కింద అన్నమయ్య జిల్లాలో ఇప్పటివరకు 141 రైతు గ్రూపులను ఏర్పాటు చేశారని, మిగిలిన చోట కూడా రైతు గ్రూపుల ఏర్పాటు, సిహెచ్సి యూనిట్ల ఏర్పాటు, యూనిట్లకు సంబంధించి బ్యాంక్ అకౌంట్ల ప్రారంభం తదితరాల్లో ప్రగతిని సమీక్షించారు. మినీ ఫిష్ రిటైల్ యూనిట్ల మార్కెటింగ్ అంశాలపై కూడా కలెక్టర్ అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. గృహ నిర్మాణంలో భాగంగా లేఅవుట్ వారీగా ఇళ్ల పట్టాల గృహ నిర్మాణ ప్రగతిని, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలకు చెందిన వివిధ అంశాలపై సమీక్షించారు. వేసవికాలం దృష్ట్యా గ్రామాలలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఇందుకు ముందుగానే ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. గ్రామాలు, మండలాలు, పంచాయతీలలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం వివిధ అంశాలపై సమీక్షించి తగు సూచనలు జారీ చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా, డిఆర్‌ఒ సత్యనారాయణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# 'మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం'

ప్రజాశక్తి-రాయచోటి

మహిళా సాధికారతే లక్ష్యంగా జగన్ పాలన సాగుతోందని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం మండలకేంద్రమైన సంబేపల్లెలో మూడవ విడత వైఎస్ఆర్ ఆసరా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మండలంలో మూడవ విడతలో 543 సంఘాలకు రూ.4.65 కోట్లులబ్ది జరుగుతోందన్నారు. అర్హతే ఆధారంగా సంక్షేమ పథకాల లబ్ధి జగనన్న పాలనలో అర్హతే ఆధారంగా సంక్షేమ పథకాల లబ్ధి అందుతోందన్నారు. నాడు నేడుతో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడంజరుగుతోందన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చిన ఘనత సిఎం జగన్‌కు దక్కుతుందన్నారు సమాజ పరిస్థితులకనుగుణంగా మహిళల్లో మార్పురావాలని శ్రీకాంత్‌రెడ్డి ఆకాంక్షించారు. మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు జగనన్న ప్రభుత్వం మల్టీ నేషనల్ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకుని వారికి శిక్షణ ఇచ్చి వ్యాపార రంగాలలో అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టిందన్నారు. మహిళల భద్రత కోసం దిశ చట్టాన్ని ఏర్పాటు చేసిందన్నారు. వైఎస్ఆర్ ఆసరా, చేయూత పథకాల ద్వారా ఆర్థికాభివృద్ధికి కృషిచేస్తోందన్నారు.

**చిన్నమండెం :** మండల వైఎస్ఆర్ ఆసరా మూడవ విడత సదస్సులో పాల్గొన్న శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ జగన్ పాలనలో మహిళా సంక్షేమం వెల్లివిరుస్తోందని పేర్కొన్నారు. మండల మూడవ విడత వైఎస్ఆర్ ఆసరా సదస్సులో జడ్‌పి మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డితో కలిసి శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన మాటను జగనన్న మాటనిలబెట్టుకున్నారన్నారు. మండలంలోని 524 సంఘాలకు రూ.3.76 కోట్లు జమమవుతోందన్నారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షుడు ముసల్‌రెడ్డి, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ రమణ, మండల ఉపాధ్యక్షుడు ఎజాష్ అలీ ఖాన్, కో-ఆప్షన్ సభ్యులు గౌస్ సాబ్, జిల్లా విజిలెన్స్ కమిటీ నెంబర్ అంజనప్ప, ఎంపిటిసిలు రమేష్, వెంకటప్ప నాయుడు, శ్యామ్ చంద్ర, రెడ్డెప్ప, రమణ, శ్రీరాములు, నరసయ్య స్వామి, సర్పంచులు లోకేశ్వర్ రెడ్డి, లక్ష్మీరెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, దామోదర్, రమణ,ఆఫ్రోజ్,మాజీ సర్పంచులు బాచి, పి.డి సత్యనారాయణ, ఎపీఎం దేవసేనా, వైయస్సార్ సీపీ నాయకులు శివా రెడ్డి, నీరంజన్ రెడ్డి, శేఖర్ జేసిపీ, శేషా రెడ్డి, జహీర్ అలీ ఖాన్, సాధిక్, బురన్ ఖాన్,సజాదు, ఖదీర్, శారుల్లా, రమణ, మురళి, డ్వాక్రా మహిళలు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.


బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

## అట్టహాసంగా బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి-రాయచోటి

పురాతన కాలం నుంచి పండగలు జాతర్ల సందర్భంగా ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించడం ద్వారా రైతుల్లో ఆనందం ప్రజల్లో ఐకమత్యం ఏర్పడుతుందని నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు . గురువారం మండలం లోని బొట్ల చెరువు లో శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి 29వ వార్షికోత్సవం సందర్భంగా హాజరై శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రజల కోలాహలం మధ్య రసవత్తరంగా ఎద్దుల బండలాగుడు పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ పురాతన కాలము నుంచి గ్రామ సీమల్లో ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించడం ప్రజలందరూ తిలకించడం ఈ పోటీలకు కొన్నిచోట్ల రైతులు చందాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇలాంటి కార్యక్రమాలను కనుమరుగు కాకుండా బొట్లచెరువు పంచాయతీ కాటిమాయకుంట ప్రజలు ఐకమత్యంగా నిర్వహించడం హర్షించదగ్గ విషయం అన్నారు .ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రజల్లో ఈర్ష ద్వేషాలు లేకుండా ఐకమత్యంగా ఉంటారని అభిప్రాయపడ్డారు . కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు కొండ భాస్కర్ రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటరామిరెడ్డి, కిరణ్, బాలు,కొండారెడ్డి, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్యం : 'గడికోట'


ప్రజాశక్తి-రాయచోటి

పేదలకు మెరుగైన వైద్యం అందించడమే జగన్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం సంబేపల్లె మండలంలో నాడు-నేడు కింద దేవపట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ.21.16 లక్షలుతోనూ, దేవపట్ల ప్రాథమిక రూ.29.44 లక్షల నిధులుతోనూ చేపట్టి పూర్తయిన మౌలిక వసతులు, అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్రామాలు, పట్టణాలలో ఆరోగ్య కేంద్రాల అభివృద్ధి పనులు చేపట్టిందన్నారు. ఆరోగ్య కేంద్రంలో అందించే వైద్య సేవలను వినియోగించుకోవాలని కోరారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అవసరముల మేరకు ఆధునీకరించి అన్ని రకాల మందులను, వైద్య సేవలను ఉచితంగా ప్రజలకు అందుబాటులో ఉంచాలనేదే ముఖ్యమంత్రి జగన్ లక్ష్యమన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే రాష్ట్రం బాగుంటుందని, రాష్ట్రంలో ప్రతి గ్రామంలో ముఖ్యమంత్రి విలేజ్ హెల్త్ క్లినిక్‌లను నిర్మిస్తున్నారన్నారు. దేవపట్ల, సంబేపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో శ్రీకాంత్‌రెడ్డి పరిశీలించి, ఒపి సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, ఎంపిపి ఆవుల నాగశ్రీ లక్ష్మీ, జడ్‌పిటిసి గొర్ల కవిత, సర్పంచుల సంఘ అధ్యక్షుడు చిదంబర్‌రెడ్డి, మండల కన్వీనర్ ఉదయ్ కుమార్‌రెడ్డి, మాజీ జడ్‌పిటి సిగొర్ల ఉపేంద్రా రెడ్డి, గొర్ల రమేష్ రెడ్డి, రాయలసీమ విద్యా సంస్థల అధినేత ఆనందరెడ్డి, వైస్ ఎంపిపి పొత్తూరి రవీంద్ర నాయుడు, వివి ప్రతాప్ రెడ్డి, సర్పంచ్‌లు ఆవుల వేణుగోపాల్ రెడ్డి, అంచల రామచంద్ర, ఉషా యువరాజు నాయుడు, నూర్, ఎంపిటిసి భద్రయ్య, మాజీ సర్పంచ్ వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

## తాళ్లపాక ఆలయాలను సందర్శించిన హైకోర్టు జడ్జి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

హైకోర్టు జడ్జి బి.కృష్ణమోహన్ కుటుంబ సమేతంగా గురువారం తాళ్లపాకలోని ఆలయాల సముదాయాలను సందర్శించారు. మూడవ అదనపు జిల్లా జడ్జి ఆర్‌వివిఎస్ మురళి కృష్ణ, జూనియర్ సివిల్ జడ్జి ఎం.సంధ్యారాణి హైకోర్టు జడ్జి దంపతులను పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించి చెన్నకేశవ ఆలయం, శివాలయం, అన్నమయ్య ఆలయాలను దగ్గరుండి సందర్శింపజేశారు. ఆలయ పూజారులు హైకోర్టు జడ్జికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో తహాశీల్దార్ సుబ్రహ్మణ్యంరెడ్డి, రెవెన్యూ సిబ్బంది, కోర్టు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


జడ్జి దంపతులను పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు


అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపిపి రాజేంద్రనాథ్ రెడ్డి

## అన్నదానం గొప్పది

**ప్రజాశక్తి-వీరబల్లి**

అన్నదానం గొప్పకార్యమని ఎంపిపి గాలివీటి రాజేంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సాయిబాబా ఆలయములో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. మాజీ సర్పంచ్ కుళాయిరెడ్డి, చంద్రమ్మ దంపతుల ఆధ్వర్యంలో వేద పండితులు ప్రత్యేక పూజలు, సత్యనారాయణ వ్రతం, అభిషేకాలు చేశారు. కార్యక్రమానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి బాబాను దర్శించుకొని సత్యనారాయణ వ్రతంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సత్యనారాయణ వ్రతం విశిష్టత గురించి వేదపండితులు రాఘవేంద్ర స్వామి భక్తులకు వివరించారు. స్వామివారి తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు. వచ్చిన భక్తులకు సింగల్ విండో చైర్మన్ తాటిగుట్ల అమర్నాథ్‌రెడ్డి, బసమ్మ దంపతులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎంపిపి గాలివీటి రాజేంద్రనాద్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ గుడి అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో రాజంపేట సర్పంచుల సంఘం అధ్యక్షుడు నాగిరెడ్డి, ఆలయ చైర్మన్ రామకృష్ణం రాజు, విఆర్‌డిఎస్ చైర్మన్ సురేంద్రారెడ్డి పాల్గొన్నారు.

## చలివేంద్రం ఏర్పాటు

**ప్రజాశక్తి-గాలివీడు**

వేసవిలో ప్రయాణీకులు, ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు గ్రామ సర్పంచ్ మిట్టపల్లి లక్ష్మీదేవి పేర్కొన్నారు. బస్టాండ్ ఆవరణములో మట్టి కుండలో మినరల్ వాటర్ నీటితో ప్రజలను తృష్ణపరచడానికి ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. పాదచారులు, ప్రయాణీకులు వడ దెబ్బకు గురికాకుండా తరచుగా నీటిని తాగాలని సూచించారు. చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## వైభవంగా రథోత్సవం

**ప్రజాశక్తి-ములకలచెరువు**

మండలంలోని కందుకూరులో వెలసిన పట్టాభి రాముడి రథోత్సవం గురువారం కనులపండువగా జరిగింది. రథోత్సవాన్ని తిలకరించడానికి వేలాదిగా భక్తులు విచ్చేయడంతో కందుకూరు భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ధర్మకర్తలు కరణంప్రకాశావు, అభిరామ్ ఆధ్వర్యంలో అర్చకులు భీమాచార్యుల వారి పర్యవేక్షణలో స్వామి వారికి ప్రత్యేక అలంకరణలతో పాటు విశేష పూజలు అందించారు. ప్రత్యేకంగా అలంకరించిన రథోత్సవంపై స్వామి వారిని ఆశీనులు గావించి మేళతాళాలు మధ్య రథోత్సవాన్ని వైభవంగా చేపట్టారు. జడ్‌పిటిసి శివన్న, ఎంపిటిసి కేశవ, వైస్ ఎంపిపి శోభ, డ్రిప్ రమణ, తహశీల్దార్ విద్యాసాగర్, పంచాయతీ కార్యదర్శి మనోహర్ ప్రత్యేక ఆహ్వానితుడు సుబ్బరాం పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి మేడా విజయభాస్కర్ రెడ్డి

## సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

**ప్రజాశక్తి-నందలూరు**

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలని ఎంపిపి మేడా విజయభాస్కర్ రెడ్డి వాలంటీర్లకు సూచించారు. గురువారం జెసిఎస్ మండల సచివాలయాల కన్వీనర్ కరిముల్లా ఖాన్ ఆధ్వర్యంలో నేటి నుంచి చేపట్టబోయే 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పిల్లల భవిష్యత్తుకు జగనన్న సంక్షేమ పథకాలు ఏ విధంగా ఉపయోగపడతాయో ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు జిల్లాప్రధాన కార్యదర్శి సయ్యద్‌అమీర్, మండల ఉపాధ్యక్షులు అనుదీప్, సుభాన్, నాగసుబ్బయ్య, జె సి ఎస్ కన్వీనర్లు నాగభూషణం, మాధవి, షావలి, గణేష్‌పాల్గొన్నారు.

## టోల్ ఛార్జీలు కట్టక ఆగిన బస్సు

**ప్రజాశక్తి-వీరబల్లి**

రాయచోట నుంచి వంగిమళ్ళ వెళ్లే ప్రభుత్వ బస్సు గురువారం బండపల్లి టోల్ ప్లాజా దగ్గర టోల్ చార్జీలు కట్టలేదని బస్సు టోల్ ప్లాజా అధికారులు నిలిపివేశారు. బస్సు నిలిపి వేయడంతో విద్యార్థులకు ప్రయాణికులకు ఇబ్బంది కలిగిందని ప్రయాణికులు తెలిపారు.


పచ్చ జెండా ఊపి 104 వాహనాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ శంకర్

## 'ప్రతి ఇంటికీ ఫ్యామిలీ డాక్టర్'

**ప్రజాశక్తి-ములకలచెరువు**

ప్రజల ఆరోగ్యం కోసం ప్రభుత్వం చేపట్టిన ప్రతి ఇంటికి ఫ్యామిలీ డాక్టర్ ఓ వరంలాంటిదని శంకర్రెడ్డి, డాక్టర్ అహ్మదాబాషా అన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా గురువారం డాక్టర్, సర్పంచ్ శంకర్రెడ్డిలు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం మారుమూల ప్రాంతాల్లోని రోగులకు ఓ వరమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సమస్యలు పెరిగితే మీ ఇంటికి డాక్టర్ తో పాటు వైద్య సిబ్బంది, వైద్య పరీక్షలు సైతం అక్కడే నిర్వహించే సౌకర్యం ఉంటుందన్నారు. మండలంలో ఎక్కడైన సరే సమస్య ఏర్పడితే యుద్ధ ప్రతిపాదికన 104వాహనం ద్వారా సకాలంలో వైద్య సేవలు వెసులుబాటు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపిహెచ్‌ఎస్‌ఇఒ బివి రమణయ్య, ఎఎన్‌ఎం రెడ్డెమ్మ పాల్గొన్నారు. **తంబళ్లపల్లి** సీజనల్ వ్యాధుల పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని వైద్య అధికారి మునికుమార్ సూచించారు. గురువారం గుండ్లపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు వ్యాధులు పరీక్షలు నిర్వహించి ముందుల పంపిణీ చేశారు. వేసవిలో వడదెబ్బ తగలకుండా ప్రజలు వడదెబ్బ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం హేమలత, ఎం ఎల్ హెచ్ పి సునీత, హెల్త్ అసిస్టెంట్ కృష్ణా నాయక్, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## యాచకులు, వృద్ధులకు అన్నం ప్యాకెట్లు పంపిణీ

**ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్**

జమ్మలమడుగు శ్రీవారి సేవా సమితి తరపున యాచకులు, వృద్ధులకు గురువారం అన్నం ప్యాకెట్లు పంపిణీ చేసినట్లు ఆ సమితి ట్రెజరర్ గుర్రం శ్రీనివాసులు తెలి పారు. పౌర్ణమి సంద ర్భంగా పట్టణంలోని అందజేశామన్నారు.కార్యక్రమంలో సమితి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి-రాజంపేట అర్బన్**

ఈనెల 15వ తేదీన శ్రీ అన్నమాచార్య కళాశాలలో నిర్వహించే మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మేడా మల్లిఖార్జున రెడ్డి, సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తెలిపారు. గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో రాజంపేట, రైల్వేకోడూరు లోని తహశీల్దార్లు, మండలాభివృద్ధి అధికారులు, ఇతర శాఖల అధికారులతో కలిసి మెగా జాబ్ మేళా పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.యస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఎంపీ మిథున్ రెడ్డి, జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి సహకారంతో ఈ జాబ్ మేళా నిర్వహించడం జరుగుతోందని తెలిపారు. నిరుద్యోగుల కోసం 80కి పైగా కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొంటున్నట్లు తెలిపారు. రూ 15 వేలు నుంచి రూ 50 వేలు వరకు వేతనంతో కూడిన ఉద్యోగాలు నిరుద్యోగులకు కల్పించడం జరుగుతుందని అన్నారు. https://forms.gle లోలాగిన్ అయి


అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

అంతర్జాలంలో నిరుద్యోగ అభ్యర్థులు దరఖాస్తు చేసుకొనేలా అధికారులు చొరవ చూపాలని సూచించారు. కార్యక్రమంలో అన్ని శాఖల ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## తూతూమంత్రంగా చలివేంద్రాల నిర్వహణ


నీరులేని చలివేంద్రం

**ప్రజాశక్తి-బి.కొత్తకోట**

పట్టణంలోని సచివాలయాల్లో ఏర్పాటు చేసిన చలివేంద్రాలు తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారు. ప్రారంభమైన తొలి రెండు రోజులు ప్రజలకు అందుబాటులో తాగునీరు ఉండేవని, తర్వాత నీటి కుండలు శుభ్రం చేయడం కానీ, నీరు నింపే కార్యక్రమం గాని చేపట్టలేదని సచివాలయాలకు వచ్చే ప్రజలు ఆరోపిస్తున్నారు. తహశీల్దారు ఆదేశాల మేరకు ఒక్కరోజు చలివేంద్రాలు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారని విమర్శిస్తున్నారు. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగిపోవడంతో గ్రామీణ ప్రాంతాల నుండి తమ సమస్యల పరిష్కారానికి బి.కొత్తకోటకు విచ్చేస్తుంటామని,తమకు త్రాగడానికి నీరు కూడా అందుబాటులో లేకపోవడంతో అవస్థలు పడుతున్నామని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని సచివాలయాలకు వచ్చే వృద్ధులు,పిల్లలు,ప్రజల దాహార్తిని తీర్చేందుకు రోజు కుండలను శుభ్రపరిచి,మంచినీటిని నింపాలనివిజ్ఞప్తి చేస్తున్నారు.

## సౌమ్యనాథుని సన్నిధిలో హైకోర్టు జడ్జి

**ప్రజాశక్తి-నందలూరు**

జిల్లాలో చారిత్రాత్మక సుప్రసిద్ధ దేవాలయమైన నందలూరులోని శ్రీ సౌమ్యనాథ స్వామి ఆలయాన్ని గురువారం హైకోర్టు జడ్జి కృష్ణమోహన్ సతీ సమేతంగా దర్శించుకున్నారు. నందలూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి కే.లత ఆధ్వర్యంలో ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ విశిష్టత గురించి, స్వామివారి చరిత్ర గురించి తెలిపారు. ఆలయ మర్యాదలతో శాలువా, పూలమాలతో సత్కరించి స్వామి వారి చిత్రపటాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు నరసింహులు మాట్లాడుతూ నందలూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు 100 సంవత్సరాలు పూర్తయిందని నూతన భవనాల కోసం నిధులు మంజూరయ్యాయని ఈ కేసు హైకోర్టులో పెండింగ్ లో ఉందని త్వరితగతిన కేసు పరిష్కారం అయ్యి నిధులు మంజూరయ్యేలా చూడాలని కోరారు. జడ్జి కృష్ణ మోహన్ సానుకూలంగా స్పందించి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజంపేట థర్డ్


జడ్జి దంపతులను పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న పూజారులు

అడిషనల్ జడ్జి మురళీకృష్ణ, జూనియర్ జడ్జి సంధ్య, డిఎస్‌పి శివ భాస్కర్ రెడ్డి, సపుల్లయ్య, ఏఎస్‌ఐ శంకర్ నాయక్, న్యాయవాదులు సుబ్బరామయ్య, షేక్, అనుదీప్, నరేష్ పాల్గొన్నారు.

## నిర్వాసితులకు ఇళ్ల స్థలాలు మంజూరు

**ప్రజాశక్తి-కురబలకోట**

ముదివేడు రిజర్వాయర్ నిర్వాసితులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ఇల్లు నిర్మాణం చేపడతామని తహశీల్దార్ భీమేశ్వర్‌రావు అన్నారు. గురువారం పిచ్చలవాండ్లపల్లి రెవెన్యూ గ్రామంలో ముదివేడు రిజర్వాయరుకు సంబందించి న లబ్ధిదారులుతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రిజర్వాయర్ బాధితులకు ప్రతి ఒక్కరికి అన్యాయం జరగకుండా చర్యలు తీసుకొని ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తామన్నారు. భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం వచ్చేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇళ్ల పట్టాల మంజూరులు అవకతవకలు తావివ్వకుండా ఉండాలని అధికారులని ఆదేశించారు. అందరికి సమన్యాయం చేయాలని అన్నారు. నిర్వాసితులకు ఇళ్ల స్థలాలు లాటరీ పద్ధతిలో వేయాలని కోరారు. గతంలో జగనన్న ఇళ్ల పట్టాల విషయంలో అధికారులపై అనుమానం కలిగిందన్నారు. ఇలాంటి వాటికి అవకాశం ఇవ్వకూడదని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టరు, డిప్యూటీ తహశీల్దార్లు, సర్వేయరు భువనేశ్వరి, ఆర్ఐ సుగుణ, విఆర్ఒ జైరాం రెడ్డి, పిచ్చలవాండ్ల పల్లె రిజర్వాయర్ నిర్వాసితులు, రైతులు పాల్గొన్నారు.

## నేడు 'జగనన్నే మా భవిష్యత్తు' ప్రారంభం

**ప్రజాశక్తి-బి.కొత్తకోట**

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన "జగనన్నే మా భవిష్యత్తు - మా నమ్మకం నువ్వే జగనన్న" కార్యక్రమం శుక్రవారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డిచే ప్రారంభమవుతుందని వైసిపి పలమనేరు నియోజకవర్గ ఇన్‌చార్జి, జిల్లా ఉపాధ్యక్షులు పాగొండ ఖలీల్ అహ్మద్,జేసీఎస్ కన్వీనర్ యన్.రెడ్డి హరిలు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి జడ్‌పిటిసి సభ్యులు, వైస్ ఎంపిపిలు, మండల నాయకులు, సర్పంచులు, ఎంపిటిసిలు, ,కార్యకర్తలు. అభిమానులు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## మహిళల అభివృద్ధే ధ్యేయంగా 'ఆసరా'

**ప్రజాశక్తి-కలికిరి**

మహిళా అభివృద్ధి ద్యేయంగా ఆసరా చెక్కులు పంపిణీ చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండలం కేంద్రంలోని మెయిన్ స్కూల్‌లో మహిళా ఆసరా చెక్కులను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధి చెందాలని సదుద్దేశంతో ఇచ్చిన మాటక కట్టుబడి హామీలను నెరవేర్చడం సిఎం జగన్‌కే సాధ్యమన్నారు. 880 గ్రూపులకు గాను ఏడు కోట్ల రూపాయలను మండలానికి కేటాయించినటు తెలిపారు. రాబోవు ఎన్నికలలో మళ్లీ వైసిపి ప్రభుత్వానికి పట్టం కడితే తప్ప పథకాల కొనసాగడం జరగదని అన్నారు. ప్రతి ఒక్క మహిళ గుర్తు పెట్టుకుని వైసిపి గెలుపుకు దోహదపడాలని తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఇక్బాల్ అహ్మద్, రాష్ట్ర కార్యదర్శి ఆగాముద్దీన్, ఎంపిపి వేంపల్లి నూర్జహాన్, జడ్‌పిటిసి పద్మజ లోకవర్ధన్, కన్వీనర్ చింతల రమేష్‌రెడ్డి, వెలుగు సిబ్బంది, ఏరియా కో-ఆర్డినేటర్ రూతు, సిసిలు ఆంజనేయులు, ఏకాంబరం, చంద్రకళ, తాహశీల్దార్ భాగ్యలత, ఎంపిడిఒ గంగయ్య, ఇఒ ఉదయ్, సర్పంచులు ఎంపిటిసిలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సిపిఆర్‌పై అవగాహన అవసరం : జెవివి

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)**

ప్రజలందరికి సిపిఆర్‌పై అవగాహన అవసరమని జనవిజ్ఞాన వేదిక ఆరోగ్య విభాగం కన్వీనర్ డాక్టర్ కాల్వ విజయ్‌నాగేంద్ర తెలిపారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సంద ర్భంగా గురువారం మైదుకూరు రోడ్డులోని రాణి తిరుమలదేవి డిగ్రీ కళాశాలలో జెవివి ఆధ్వర్యంలో 'మనిషి స్పృహ కోల్పోయి నప్పుడు ఏమి చేయాలి' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ప్రిన్సిపల్ చంద్రశేఖర్ అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయ్‌నాగేంద్ర మాట్లాడుతూ ఆకస్మాత్తుగా కానీ, ప్రమాదవశాత్తూకానీ మనిషి స్పృహ కోల్పోతే మనం ఆ మనిషికి సిపిఆర్‌ని ప్రథమ చికిత్స చేయడం ద్వారా ఆ వ్యక్తిని కాపాడవచ్చునన్నారు. జెవివి రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్ మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ అందరికీ ఆరోగ్యం అనే నినాదపు లక్ష్యం నెరవేరాలంటే ప్రాథమిక ఆరోగ్యంపై దృష్టి సారించాలని తెలిపారు. సిపిఆర్‌పై అందరికీ అవగాహన ఉండడం కీలకమన్నారు. అనంతరం విద్యార్థులకు సిపిఆర్‌పై డెమో, ప్రాక్టికల్ నాలెడ్జ్‌ని ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ తరునేందు శేఖర్, జెవివి జిల్లా ఆరోగ్య విభాగం కన్వీనర్ డాక్టర్ చక్రధర్, జిల్లా ఉపాధ్యక్షుడు పోలంకి శ్రీరాములు, మురళీగుప్త, శర్వాణి, అధ్యాపకులు, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రత్యేక ప్రార్థనలకు చర్చీలు ముస్తాబు

**ప్రజాశక్తి - పోరుమామిళ్ల టౌన్**

శుక్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా మండలంలోని ఆర్‌సిఎం చర్చి, గిరీనగర్‌లోని సిఎస్ఐచర్చి, మార్కాపురం, బొప్పపురం, పోరుమామిళ్ల కర్మేలు ప్రార్థన మందిరం, టేకురుపేట గ్రామాల చర్చిలు ముస్తాబయ్యాయి. ఆయా చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు.

## 'మా నమ్మకం నువ్వే జగనన్న' హాస్యాస్పదం

**- పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి**

**ప్రజాశక్తి - వేంపల్లె**

వైసిపి ప్రభు త్వం చేపట్టిన జగనన్నే మా భవిషత్తు-మా నమ్మకం నువ్వే జగనన్న' అనే కార్యక్రమం హాస్యాస్పదమని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి విమర్శించారు. స్థానికంగా గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగనన్నే మా భవిష్యత్తు అనే దానికన్నా 'జగనే మా దరిద్రం-జగనే మా శని' అని పేరు పెట్టడం సబబుగా ఉంటుందని అన్నారు. జగన్ పాలనలో అన్ని వస్తువుల ధరలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మారిం దన్నారు. అరాచకంలో ఆఫ్ఘనిస్తాన్, అప్పుల్లో శ్రీలంకను వైసిపి ప్రభుత్వం దాటిపోయిందని విమర్శించారు. జగన్ పాలనలో గన్ కల్చర్, గంజాయి కల్చర్ పెట్రేగి పోయాయన్నారు. లాండ్, శాండ్, వైన్, మైన్స్, ఎర్రచందనం, బియ్యం మాఫియా అధికమైందన్నారు. రాజధాని లేని రాష్ట్రంగా ఎపి మిగిలిందన్నారు. వరప్రసాదిని పోలవరం ప్రశ్నార్థకంగా మారిందన్నారు. సంజీవిని లాంటి ప్రత్యేకహోదా ఊసేలేదన్నారు. నవరత్నాలు నకిలీ రత్నాలుగా మారినట్లు తెలిపారు. మాట తప్పడం జగన్ దిన చర్య అయిందన్నారు.

## వైభవం.. సీతారాముల కల్యాణం

**ప్రజాశక్తి - కొండాపురం**

మండలంలోని పునరావాస కాలనీలు ఓబన్నపేట, సీతాపురం, చౌటిపల్లెలో చైత్రమాసం పౌర్ణమి సందర్భంగా సీతారాముల కల్యాణాన్ని వేదపండితులు మంగళవాయిద్యాలతో వైభవంగా నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు కుల మతాలకు అతీతంగా కుటుంబ సమేతంగా ప్రజలు విచ్చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అల్పాహారం, భోజనాలు ఏర్పాటు చేశారు. సాయంత్రం మేళతాళాలు, భజన బృందాలతో ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు.

## ప్రతిభ చాటిన శ్రీసాయి ఇంజినీరింగ్ విద్యార్థులు

**ప్రజాశక్తి-రాయచోటి**

శ్రీసాయి ఇంజినీరింగ్ కళాశాల రెండవ సంవత్సరం ఇంజనీరింగ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ డిపార్ట్మెంట్‌లో మొదటి సెమిస్టర్ విద్యార్థులు యూనివర్సిటీ విడుదల చేసిన ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనపరిచి అత్యుత్తమ ఫలితాలు సాధించారని సాయి విద్యా సంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్‌రెడ్డి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో సి.నస్రీన్ 82.13 శాతంతో మొదటి ర్యాంకు పి అనిత 82.03శాతం, రెండవ ర్యాంకు, సి.సాయితేజ 83.04 శాతం మూడవ ర్యాంకు, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగము నుంచి ఎన్ మానస ప్రియ 89.01 శాతం తో మొదటి ర్యాంకు ఎన్ పావని87.00 శాతంతో రెండవ ర్యాంకు, డి.సాయికుమారి 86.02 శాతంతో మూడవ ర్యాంకు సాధించి యూనివర్సిటీ స్థాయిలో అగ్రగామిగా నిలిచారని తెలిపారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులను, ఫలితాల సాధనలో భాగమైన అధ్యాపకులను అభినందిస్తూ, ప్రతి ఒక్కరికి ఉద్యోగ ఉపాధి భరోసా కల్పించడానికి మౌలిక వసతులు కల్పిస్తున్నామని వివరించారు. వీరిని ఆదర్శంగా తీసుకుని మిగిలిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని దిశానిర్దేశం చేశారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని అంకితభావంతో కృషి చేసి, క్రమశిక్షణతో ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థానాన్ని అధిరోహించాలని సూచించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.బాలాజీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగాధిపతి శుభహాన్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగాధిపతి డాక్టర్ ఎ.కార్తికేయన్, అధ్యాపకులు అభినందించారు.




బస్టాండులో తాటిముంజలను కొనుగోలు చేస్తున్న ప్రజలు

## తాటి ముంజలకు భలే గిరాకీ

**ప్రజాశక్తి-గాలివీడు**

వేసవిలో శరీరం వేడిని తట్టుకొని సమాత స్థితిలో ఉంచడానికి పుచ్చకాయ, దోసకాయతో పాటు తాటిముంజలు వేసవిలో విరివిగా లభిస్తాయి. మండంలోని పెద్దమండెం, కలిచర్ల గుడిసంచెరువు గ్రామాలలో తాటిచెట్లు ఎక్కువు ఉన్నాయి. గుడిసంచెరువు చెందిన పీరా మాట్లాడుతూ రెండు గ్రామాలలో 45 చెట్లను కొనుగోలు చేశామని, ఆ చెట్ల నుంచి తాటిమంజలును దింపుకొని వాటిని ఆటోలు వేసుకొని గాలివీడులో విక్రయిస్తామని చెప్పారు. డజను వంద రూపాయలకు విక్రయిస్తున్నట్లు చెప్పారు. ఎండలు ఎక్కువుగా ఉండటంతో తాటిముంజలను కొనుగోలు చేసేందుకు ప్రజలు మక్కువ చూపడంతో భలే గిరాకీ పెరిగిందని పేర్కొన్నారు.

# క్రైం కార్నర్

## సిమెంటు లారీ బోల్తా

**ప్రజాశక్తి-నిమ్మనపల్లి**


బోల్తా పడిన సిమెంటు లారీ

మదనపల్లి-నిమ్మనపల్లి రోడ్డు లోని ముష్టూరు క్రాస్ వద్ద సిమెంటు లోడ్‌తో వస్తున్న లారీ బోల్తా పడిన సంఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం జిల్లా తాడిపత్రి నుంచి సిమెంటు లోడుతో నిమ్మనపల్లెకు వస్తున్న అశోక్ లైలాండ్ ఎపి02ఎక్స్6757 నెంబర్ గల లారీ గురువారం ఉదయం ముష్టూరు క్రాస్ వద్ద ఉన్న మలుపులో బోల్తా పడిందని అన్నారు. లారీ డ్రైవర్ చింటూ బాలుకు స్వల్పంగా గాయాలు కావడంతో, ప్రమాదం నుంచి బయటపడ్డారన్నారు. లారీ డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం 108 వాహనంలో మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.


మృతదేహాన్ని వెలికితీస్తున్న అగ్నిమాపక సిబ్బంది

## ఎట్టకేలకు మృతదేహం వెలికితీత

**ప్రజాశక్తి-నిమ్మనపల్లి**

దామర ఒడ్డులో మృతిచెందిన వ్యక్తి మృతదేహం ఆచూకీ కోసం స్థానిక తహశీల్దార్ సి.ఆర్ మంజుల ఆదేశాల మేరకు నిమ్మనపల్లి పోలీసులు, వాల్మీకిపురం అగ్నిమాపక స్టేషన్ ఫైర్ ఆఫీసర్ డి.సుబ్బరాజు నేతృత్వంలోని బృందం గత మూడు రోజులుగా తీవ్రంగా శ్రమించి గురువారం సాయంత్రం ఎట్టకేలకు మృతదేహాన్ని వెలికి తీశారు. వివరాల్లోకి వెళితే...నిమ్మనపల్లి కందూరు రోడ్డు మార్గంలోని పెద్దమాదిగపల్లి వద్ద ఉన్న దామరఒడ్డులో మంగళవారం మధ్యాహ్నం పెద్దమాదిగపల్లెలో నివాసముంటున్న పి.సుధాకర (35) అనే వ్యక్తి ఈత కొడుతూ ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. గురువారం ముదివేడు ఎస్ఐ సుకుమార్, నిమ్మనపల్లి ఇన్‌ఛార్జి ఎస్ఐ రవీంద్రబాబు సంఘటన స్థలాన్ని పరిశీలించి స్థానిక పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి మృతదేహం కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. గత మూడు రోజులుగా స్థానిక పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది మృతదేహం ఆచూకీ కోసం విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. దామర ఒడ్డులో నీటి లోతు అధికంగా ఉండటంతో కెమెరా సాయంతో, పాతాళ భైరవి సాయంతో, పడవల గుర్తించటానికి ప్రయత్నించగా వీలుకాలేదు, చివరకు నీటి లోతును తగ్గించడానికి సర్పంచు భర్త మల్లప్ప ఒడ్డు మొరవ కట్టను జెసిబి సాయంతో తొలగించి నీటిని దిగువకు విడుదల చేశారు. విస్తృత ప్రయత్నాల అనంతరం అధికారులు మృతదేహాన్ని ఎట్టకేలకు గుర్తించారు. ముష్టూరు శ్రీధర్ మూడు రోజులపాటు బోటును ఏర్పాటు చేసి మృతదేహాన్ని వెలికి తీయడానికి అధికారులకు సహాయ సహకారాలు అందించారు. భర్త మృతితో భార్య శశికళ, ముగ్గురు కుమారుల రోధనలు వీక్షకులను కంటతడి పెట్టించాయి. మృతుని భార్య శశికళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. శవ పరీక్ష నిమిత్తం మృతదేహాన్ని మదనపల్లి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శవ పరీక్ష అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రమేష్ బాబు, మహమ్మద్, కేశవ, శివ, రెడ్డి భాష, విఆర్ఒ రజినీకాంత్, వాల్మీకిపురం అగ్నిమాపక సిబ్బంది ఎల్‌ఎఫ్ బాబయ్య, శ్రీనివాసులు, విజయ్ భాస్కర్ రెడ్డి, రాజగోపాల్ నాయక్, కిరణ్ బాబు,బాబ్జి, రవి చేతన్ కుమార్, బలరాం నాయక్, ఎండి మురళి, చిన్నబాబు, భాస్కర, ఇమ్రాన్ భాష, శివశంకర్ పాల్గొన్నారు.

## ఘర్షణ : కేసు నమోదు

**ప్రజాశక్తి-కలకడ**

ఘర్షణపై కేసు నమోదు చేసి నట్లు ఎఎస్ఐ బాలకృష్ణుడు తెలిపారు. మండలంలోని గంగాపురం పంచాయతీ గంగాపురం గ్రామానికి చెందిన వెంకటరమణ అతని భార్య జయమ్మ, వారి కుమార్తెలు కలసి వారి గొర్రెలను ఊరి చుట్టుప్రక్కల ఉన్న ప్రభుత్వ భూములు మేపు కొనుచుండగా, అదే గ్రామానికి చెందిన కోట శ్రీనివాసులు నాయుడు, చంద్రయ్య నాయుడు, రామచంద్ర నాయుడులు కలిసి ఈ భూములలో మేము పశువులను మేపుకుంటామని, మీ గొర్రెలను ఇక్కడ నుండి తోలుకుని వెళ్లండి అని వారిని అవమానంగా మాట్లాడి, కాళ్లతో తన్ని ,కొట్టి గాయపరిచినందుకు వెంకటరమణ భార్య జయమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ తెలిపారు.

## మరిదిని కొడవలితో నరికిన వదిన

**ప్రజాశక్తి -కలకడ**

మరిదిని వదిన కొడవలితో నరిగిన సంఘటన మండలంలో జరిగింది. మండలములోని కోట గుడిబండ పంచాయతీ ఎల్లం గుడిబండ హరిజనవాడకు చెందిన నగిరిమడుగు సాంబశివను అతని అన్న నగిరి మడుగు శేఖర్ భార్య వీరనాగమ్మ కొడవలితో రెండు చేతులను నరికి గాయపరిచింది. ఘర్షణకు సంబంధించిన మరిన్ని వివరాలు తెలియాల్సివుంది. సంఘటన జరిగిన వెంటనే కలకడ 108 వాహనం పైలెట్ శ్రీనివాసులు గాయపడిన సాంబశివను రాయచోటికి చికిత్స నిమిత్తం తరలించినట్లు సమాచారం.

## యువకుడి మృతదేహం లభ్యం

**ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి**

మండలంలోని కాకులవరం సమీపంలోని ఓ బావిలో రాయచోటి మంగళపల్లికి చెందిన ఐదు మంది యువకులు బుధవారం ఈతకు వచ్చారు. వీరు మద్యం సేవించి బావిలో ఈత ఆడుతుండగా తిరుపతి దేవేంద్ర(17) అనే యువకుడు గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న లక్కిరెడ్డిపల్లె ఎస్ఐ వినోద్ కుమార్ తమ సిబ్బందితో రాత్రి అంతా బావిలో గాలించి ఎటికేలకు గురువారం ఉదయం మృతి చెందిన యువకుని బయటకు తీశారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు.